
సాక్షి పల్నాడు

మంగళవారం । 17 । డిసెంబర్ । 2024



## సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 579.80 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 7,096 క్యూసెక్కులు విడుదలవుతోంది.



## వైభవంగా కల్యాణం

నగరంపాలెం: స్థానిక బ్రాడీపేట 2/7వ అడ్డ రోడ్డులోని శ్రీ గౌరీవిశ్వేరాలయంలో స్వామి వారి జన్మనక్షత్రం సందర్భంగా సోమవారం కల్యాణం నిర్వహించారు.

## ఆరుద్రాభిషేకాలు



రేపల్లె రూరల్: ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ఇసుకపల్లిలోని చెన్నమల్లేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ఆరుద్రాభిషేకాలు నిర్వహించారు. భక్తులు మొక్కుబడులు చెల్లించుకున్నారు.

## న్యూస్‌రీల్

### ఇంధన పొదుపు సామాజిక బాధ్యత

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



గుంటూరు వెస్ట్: సంప్రదాయ ఇంధన వనరులతో పాటు విద్యుత్‌ను ఆదా చేయడం సామాజిక బాధ్యతని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు–2024లో భాగంగా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ, డీఆర్వో ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు ఎం.గంగరాజు, లక్ష్మీకుమారి, ఎస్ఈ ఆపరేషన్స్ అధికారి మూర్తి, జిల్లా అధికారులు ప్రత్యేక పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ 20వ తేదీ వరకు వారోత్సవాలు జరుగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు యువతకు కూడా పెద్దఎత్తున విద్యుత్ ఆదాపై అవగాహన కల్పించాలని ఆమె ఆదేశించారు.

### నేడు, రేపు పాలిటెక్నిక్ కళాశాలలో క్రీడా పోటీలు

గుంటూరు రూరల్: మండలంలోని నల్లపాడు ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రెండు రోజుల పాటు ఐపీఎస్‌జీఎం–2024 పేరిట నిర్వహించనున్న క్రీడా పోటీలను మంగళవారం ప్రారంభినున్నట్లు ప్రిన్సిపాల్ టి.శేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు చెందిన 513 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. ప్రారంభోత్సవంలో సీఐడీ డీఎస్పీ గోలి లక్ష్మయ్య, విద్యాశాఖ అధికారి సి.వి. రేణుక, పీబీఆర్ చలపతి మెటల్ ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ పిల్లా వెంకటేశ్వరరావు, క్రీడల అభివృద్ధి అధికారి పి. నరసింహారెడ్డి తదితరులు పాల్గొంటారని ఆయన తెలిపారు. ఎస్‌బీయూ రీజినల్ జాయింట్ డైరెక్టర్ నిర్మల్ కుమార్ ప్రియ పర్యవేక్షణలో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోటీల అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం చేయనున్నట్లు ఆయన తెలిపారు.

### ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం



మంగళగిరి: నగర పరిధిలోని ఆత్మకూరు బాపూజీ విద్యాలయంలో సోమవారం రాత్రి ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. త్రిదండి చిన్న జీయర్ స్వామి ప్రారంభించారు. తొలి రోజు ధనుర్మాస విశిష్టతను, గోదా అమ్మవారు వ్రత మహోత్సవాలను ఎలా నిర్వహించారనే వివరాలను తెలియజేశారు. భక్తులకు సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో పలువురు స్వామీజీలు పాల్గొన్నారు.

### యూట్యూబ్‌లో గణిత ప్రశ్నపత్రం

గుంటూరు ఎడ్యుకేషన్: గణితశాస్త్ర యూట్యూబ్‌లో ప్రత్యక్షం కావడం విద్యాశాఖను ఉలికిపాటుకు గురి చేసింది. జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో ఆరో తరగతి నుంచి టెన్త్ విద్యార్థులకు నిర్వహిస్తున్న సమ్మేటివ్ అసెస్‌మెంట్ (ఎస్ఏ–1) పరీక్షల షెడ్యూల్ ప్రకారం సోమవారం గణితశాస్త్ర పరీక్ష జరగాల్సి ఉంది. ప్రశ్నపత్రాలను స్కూల్ కాంప్లెక్స్‌ల నుంచి ప్రతి రోజూ పరీక్ష సమయానికి గంట ముందుగా సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తీసుకెళ్లే విధంగా ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు 6,8,10 తరగతుల విద్యార్థులకు పరీక్ష నిర్వహించేందుకు జిల్లావ్యాప్తంగా ఏర్పాట్లు చేశారు. ఉదయం 9.15 గంటలకు గణితం పరీక్షను రద్దు చేస్తున్నట్లు ఉన్నతాధికారుల నుంచి వాట్సాప్, టెలీగ్రామ్ ద్వారా సందేశాలు అందాయి. ప్రశ్నపత్రం యూట్యూబ్‌లో ప్రత్యక్షం కావడంతో పరీక్షను రద్దు చేస్తున్నట్లు ఉన్నతాధికారుల ఆదేశాలతో స్పందించిన జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక తక్షణమే ఎంఈవోలు, హెచ్‌ఎంలకు సమాచారాన్ని పంపారు. ఉదయం జరగాల్సిన పరీక్షతో పాటు మధ్యాహ్నం 7, 9వ తరగతుల విద్యార్థులకు మాథ్స్ పరీక్షను సైతం రద్దు చేశారు. గణితశాస్త్ర పరీక్షను ఎస్సీఈఆర్టీ ద్వారా పంపే మరొక ప్రశ్నపత్రంతో ఈనెల 20న నిర్వహిస్తామని డీఈవో రేణుక చెప్పారు. ప్రశ్నపత్రం యూట్యూబ్‌లో ప్రత్యక్షం కావడంతో గుంటూరు జిల్లాలోని స్కూల్ కాంప్లెక్స్‌లలో ఉంచిన ప్రశ్నపత్రాల బండిళ్లను హడావుడిగా ఆయా ప్రాంతాల్లోని పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ప్రతి రోజూ పోలీస్ స్టేషన్ల నుంచే ప్రశ్నపత్రాలను తీసుకెళ్లాలని హెచ్‌ఎంలకు సూచించారు.

# ఆ 'గర్భ' కష్టాలు

## ఏరియా ఆస్పత్రిలో వైద్య సేవలు దూరం!

- ఇబ్బందులు పడుతున్న గర్భిణులు
- హైరిస్క్ పేరుతో గుంటూరుకు సిఫార్సు

సత్తెనపల్లి: సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో వైద్య సేవలు దూరమవుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైద్య రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా గర్భిణుల అవస్థలు చెప్పనలవి కాదు. ఇక్కడ ముగ్గురు గైనకాలజిస్ట్‌లు ఉండాల్సి ఉండగా, ఒక్కరు మాత్రమే విధుల్లో ఉన్నారు. ఆమె కూడా జూనియర్ గైనకాలజిస్ట్ కావడంతో వచ్చిన గర్భిణులను హైరిస్క్ పేరుతో గుంటూరు జీజీహెచ్‌కు రిఫర్ చేస్తున్నారు. మందులు కొరత కూడా వేధిస్తోంది. రోగులు మందులు బయట కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఉందనే ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆస్పత్రిలో రోజూ 500పైగా ఓపీ నమోదవుతుంటుంది. ఇన్‌పేషెంట్లు మరో 60 మంది ఉంటారు. ఇది పేరుకే వంద పడకల ఆస్పత్రి అని, అన్నీ సమస్యలేనని, వైద్య సేవలు సరిగా అందడం లేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### నార్మల్ కేసును హైరిస్క్ పేరుతో రిఫర్

సంచార జీవనం సాగించే చడవల అలివేలు, భర్త జానీ దంపతులకు ఇద్దరు బిడ్డలు. గత కొంతకాలంగా సత్తెనపల్లి, రెంటపాళ్లలో రోడ్ల పక్కన డబ్బాలు ఏరుకుంటూ డేరాలు వేసుకొని జీవిస్తున్నారు. అలివేలు మూడో కాన్పు కోసం ఏరియా వైద్యశాలకు వచ్చింది. అయితే హైరిస్క్ పేరుతో ఆమెను సోమవారం గుంటూరుకు రిఫర్ చేశారు. 108లో ఆమెను గుంటూరు తీసకెళ్తుండగా మార్గమధ్యలోనే మేడికొండూరు మండలం కొర్రపాడు వద్ద అలివేలు ఆరోగ్యవంతమైన మగబిడ్డను ప్రసవించింది. దీంతో నార్మల్ డెలివరి కేసును హైరిస్క్ పేరుతో గుంటూరు రిఫర్ చేయడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.



మార్గమధ్యలో 108 వాహనంలో అలివేలు జన్మనిచ్చిన మగబిడ్డను చూపుతున్న 108 సిబ్బంది

### రేడియాలజిస్ట్ ఎక్కడ?

ఏరియా వైద్యశాలలో స్కానింగ్ సదుపాయం ఉన్నా గర్భిణులు పరీక్షల కోసం ప్రైవేట్ క్లినిక్‌లకు వెళ్లాల్సి వస్తోంది. రేడియాలజిస్ట్ పోస్ట్ భర్తీ చేయక పోవడంతో ఈ దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా పాలకులు, వైద్యాధికారులు స్పందించి రేడియాలజిస్టును నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

### ఇబ్బందులు రానివ్వం

ఏరియా వైద్యశాలలో ముగ్గురు గైనకాలజిస్టులు ఉన్నారు. ఒకరు ఇటీవల సెలవుపై వెళ్లారు. మరొకరు కూడా రావడం లేదు. జూనియర్ డాక్టర్ మాత్రమే సేవలు అందించాల్సి రావడంతో కొద్దిగా ఇబ్బంది తలెత్తింది. సెలవు పెట్టిన గైనకాలజిస్ట్ సుజాత వస్తే ఇబ్బందులు ఉండవు. రేడియాలజిస్ట్ లేకపోవడంతో స్కానింగ్ సమస్య ఉంది. గైనకాలజిస్టులే స్కానింగ్ కూడా చేస్తున్నారు. గర్భిణులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ బి.లక్ష్మణరావు, ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్, సత్తెనపల్లి

## కుటుంబ కలహాల నేపథ్యంలో

# గొడ్డలితో దాడి





గొడ్డలి దాడిలో తీవ్రంగా గాయపడిన రమేష్, మంగమ్మ

### నలుగురికి తీవ్ర గాయాలు

విజయపురిసౌత్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి గొడ్డలితో దాడి చేసి నలుగురిని గాయపర్చాడు. ఈ ఘటన మాచర్ల మండలం పశువేముల గ్రామంలో సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన పండ్ల హరిశ్చంద్ర, అతని అల్లుడు బెజవాడ బ్రహ్మం ఇద్దరూ కుటుంబ కలహాల నేపథ్యంలో గొడవ పడుతున్నారు. విషయం తెలుసుకున్న బ్రహ్మం అన్న బెజవాడ రమేష్, అక్కలు పండ్ల మంగమ్మ, పోచమల్ల పద్మ గొడవ పడవద్దని వారించారు. దీంతో కోపంతో హరిశ్చంద్ర గొడ్డలి తీసుకొని రమేష్, మంగమ్మ తలలపై నరకటంతో తీవ్ర గాయలు పాలయ్యారు. అలాగే అల్లుడు బ్రహ్మం, పద్మలపై కూడా హరిశ్చంద్ర గొడ్డలితో దాడి చేయటంతో వారూ గాయపడ్డారు. బాధితులను బంధువులు మాచర్లలోని ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. తీవ్రంగా గాయపడిన రమేష్, మంగమ్మలను ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరు తరలించారు. మాచర్ల రూరల్ సీఐ నఫీజ్‌బాష, టౌన్ సీఐ ప్రభాకర్, విజయపురిసౌత్ ఎస్ఐ షేక్ మహమ్మద్ షఫీ ఆస్పత్రికి వచ్చి బాధితుల దగ్గర వివరాలు సేకరించారు. పశువేముల గ్రామంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ నఫీజ్ బాష తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.



గాయపడిన బ్రహ్మం



గాయపడిన పద్మ

## రీ ఓపెన్ అర్జీలపై జిల్లా అధికారులదే బాధ్యత

### కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) వచ్చిన అర్జీలు రీ ఓపెన్ అయితే జిల్లా అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు హెచ్చరించారు. సోమవారం ప్రత్యేకంగా రీ ఓపెన్ అర్జీలపై ఆయన అధికారులతో సమీక్షించారు. మొత్తం 32 రీ ఓపెన్ అర్జీలను వ్యక్తిగతంగా పరిశీలించారు. అర్జీదారులకు ఫోన్ చేసి అధికారులు వ్యవహరించిన తీరు, సంతృప్తికరమైన పరిష్కారాలు అందాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రతి సోమవారం మధ్యాహ్నం రీ ఓపెన్ అర్జీలపై సమీక్ష ఉంటుందని, అధికారులు తప్పనిసరిగా పాల్గొని వివరణ ఇవ్వాలని సూచించారు.




సుభాష్ మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లి మాధవి బంధువులు

# కార్పొరేట్ బడితెగింపునకు బలి

- శ్రీచైతన్య టెక్నో స్కూల్ నిర్లక్ష్యంతో ఇద్దరి మృతి
- నీటికుంటలో పడి బస్సు క్లీనర్‌తోపాటు ఓ విద్యార్థి దుర్మరణం
- రెండు కుటుంబాలకు తీరని వేదన
- పులిపాడు, ఇరికేపల్లిల్లో విషాదఛాయలు

గురజాల : పాఠశాల బస్సు నిర్వహణలో దాచేపల్లి శ్రీచైతన్య టెక్నో స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యం రెండు నిండు ప్రాణాలను బలిగొంది. మార్గమధ్యలో బస్సు రేడియేటర్‌లో నీరు అయిపోయి పొగలు రావడంతో క్లీనర్‌తోపాటు ఓ విద్యార్థి నీటి కోసం సమీపంలోని కుంట వద్దకు వెళ్లి అందులో ప్రమాదవశాత్తూ జారిపడి మరణించారు. ఈ విషాద ఘటన పులిపాడు–నడికుడి మధ్యలో సోమవారం జరిగింది. రెండు కుటుంబాలకు తీరని వేదన మిగిల్చింది. విద్యార్థి మృతితో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. ''దేవుడా.. మాకెందుకు ఈ కడుపుకోత.. ఉన్న ఒక్కగానొక్క కొడుకును కాకుండా చేశావేందయ్యా'' అంటూ బోరున విలపిస్తున్నారు. వారిని ఓదార్చడం ఎవరి తరమూ కావడం లేదు. యూనిఫాం, బూట్లు వేసుకుని బ్యాగు తగిలించుకుని ఉదయం దొరబాబులా స్కూల్‌కు బస్సులో వెళ్లిన తమ బిడ్డ అంతలోనే విగతజీవిగా రావడంతో ఆ తల్లిదండ్రుల వేదన వర్ణణాతీతంగా ఉంది. వారం రోజుల కిందటే పుట్టినరోజు చేశామని, ఇంతలోనే కానరాని లోకాలకు వెళ్లాడంటూ తల్లి రోదిస్తున్న తీరు అందరినీ కంటతడి పెట్టించింది. గురజాల మండలం పులిపాడుకు చెందిన కుంచా శ్రీనివాసరావు, మాధవి దంపతులది వ్యవసాయ కూలీ కుటుంబం. వీరికి ఒక కుమారుడు సుభాష్ (11), కుమార్తె విద్యశ్రీ ఉన్నారు. కొడుకు దాచేపల్లి శ్రీ చైతన్య టెక్నో స్కూల్లో ఐదో తరగతి చదువుతున్నాడు. కుమార్తె గురజాలలోనే ప్రైవేట్ పాఠశాలలో చదువుతోంది. రోజులాగానే సోమవారం ఉదయం సుభాష్ బస్సులో స్కూల్‌కి వెళ్లాడు. మార్గమధ్యలో పులిపాడు–నడికుడి మధ్యలో బస్సు రేడియేటర్‌లో నీరు అయిపోవడంతో పొగలొచ్చాయి. దీంతో డ్రైవర్ ఆదేశాల మేరకు సమీపంలోని నీటి కుంటలో నీరు తెచ్చేందుకు క్లీనర్ కోటేశ్వరరావు వెళ్లాడు. అతనికి సాయంగా సుభాష్ వెళ్లాడు. కోటేశ్వరరావు నీటి కుంటలోకి దిగి పైనున్న సుభాష్‌కు నీరందిస్తున్న క్రమంలో ఇద్దరూ ప్రమాదవశాత్తూ కుంటలో పడిపోయి మునిగిపోయి మరణించారు. విగతజీవిగా తిరిగొచ్చిన సుభాష్‌ను చూసి మాధవి, శ్రీనివాసరావు, బంధువులు, గ్రామస్తులు కన్నీరుమున్నీరయ్యారు.



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ జగదీష్

### పెద్దదిక్కు మృతితో విలవిల

దాచేపల్లి : పెద్దదిక్కుగా ఉన్న క్లీనర్ కోటేశ్వరరావు మరణించడంతో ఆయన కుటుంబం తల్లడిల్లుతోంది. దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని ఇరికేపల్లికి చెందిన కోటేశ్వరరావుకు భార్య మంగమ్మ, 21 ఏళ్ల దివ్యాంగుడైన కుమారుడు సందీప్ ఉన్నారు. సందీప్ చిన్ననాటి నుంచి దివ్యాంగుడు కావడంతో కోటేశ్వరరావు అన్నీతానై చూసుకునేవాడు. కొడుకుకు వైద్యం చేయిస్తున్నాడు. తండ్రి సాయంతోనే సందీప్ బయటకు వచ్చేవాడు. పేద కుటుంబం కావడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. కుటుంబపోషణ, కుమారుడి వైద్యఖర్చుల కోసం కోటేశ్వరరావు బస్సు క్లీనర్‌గా పనిచేస్తుండగా మంగమ్మ ఇంటి వద్ద చిన్నపాటి దుకాణం పెట్టుకుని నెట్టుకొస్తున్నారు. కోటేశ్వరరావు మరణంతో ఆ కుటుంబం దిక్కులేనిదైంది.

### శ్రీచైతన్య టెక్నో స్కూల్‌కు షోకాజ్ నోటీస్

నరసరావుపేట ఈస్ట్: దాచేపల్లి నారాయణపురంలోని శ్రీచైతన్య టెక్నో స్కూల్ యాజమాన్యానికి జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ షోకాజ్ నోటీస్ జారీ చేశారు. బస్సు లోపాల వల్లే దుర్ఘటనకు కారణమయ్యారని పేర్కొంటూ నిర్వహణ, పర్యవేక్షణ, భద్రతా చర్యల వైఫల్యాలపై వివరణ ఇవ్వాలని ఆదేశించారు. అర్హత కలిగిన డ్రైవర్ నియామకంలో విఫలకావడంపై ప్రశ్నించారు. పాఠశాల గుర్తింపును రద్దుచేయడం తోపాటు క్రిమినల్ కేసులు ఎందుకు తీసుకోకూడదో తెలపాలని పేర్కొన్నారు. నోటీసు అందిన 24 గంటల్లో వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

# ప్రతి ఫిర్యాదునూ పరిష్కరించండి



కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ సూరజ్‌గనోరే, అధికారులు

- కలెక్టర్ అరుణ్‌బాబు
- గ్రీవెన్స్‌లో అర్జీల స్వీకరణ

నరసరావుపేట: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చే ప్రతి ఫిర్యాదూ పరిష్కారం కావాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి 40 వినతులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదులు పరిష్కరించి ప్రజల్లో నమ్మకం పెంచాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, జిల్లా రెవెన్యూ అధికారి ఏకా మురళి, జిల్లా అధికారులు సీడీపీవో పీడీ ఉమామహేశ్వరి, డీపీవో ఎంవీ విజయభాస్కరరెడ్డి పాల్గొన్నారు.

### సబ్సిడీ రుణాలు ఇప్పించండి



ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి కోసం దళితులు, ఆదివాసీలకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలి. ఈ మేరకు చర్యలు తీసుకోవాలి.

– రాష్ట్రీయ మహా సమితి అధ్యక్షులు ఆనందకుమార్, పలు గ్రామాల దళితులు

### పొలంలోకి మురుగునీరు రాకుండా చూడాలి

నాకు రొంపిచర్లలో ఎకరం పొలం ఉంది. ఆ పొలం పక్కనే ఎస్సీ కాలనీలోని మురుగునీరు వదులుతున్నారు. వద్దని చెబుతున్నా పట్టించుకోవట్లేదు.

– షేక్ అబ్దుల్ సలామ్, రాయపూడి, తురుమెళ్ల మండలం

### ఆక్రమణలు తొలగించాలి



నరసరావుపేట పట్టణంలో పురపాలకసంఘ అధికారులు చేపట్టిన ఆక్రమణల తొలగింపు కార్యక్రమం కొనసాగించి అన్ని రోడ్లకు ఇరువైపులా ఏర్పాటుచేసిన వాటిని తొలగించాలి. రైల్వేస్టేషన్–ఆర్టీసీ బస్టాండ్ రోడ్డు, వినుకొండ, సత్తెనపల్లి, పల్నాడు, స్టేషన్, గుంటూరు రోడ్లలో ఆక్రమణలు తొలగించాలి.

– కాసా రాంబాబు, వైదన వెంకట్, రంగయ్య, సీపీఐ నాయకులు

### 'మైహోం' తీసుకున్న భూములు తిరిగి ఇవ్వండి



గ్రామంలో 20 ఏళ్ల క్రితం రూ.50 వేలు, రూ.లక్ష, రూ.5 లక్షల ధరతో మా భూములను మైహోం సంస్థ సిమెంట్ కర్మాగారం పెట్టి ఉపాధి చూపిస్తామంటూ కొనుగోలు చేసింది. ఇప్పటివరకు పరిశ్రమ పెట్టలేదు. మాకు ఉపాధిలేదు. వెంటనే ఆ భూములను ప్రభుత్వం తిరిగి తీసుకొని మాకు అప్పగించాలి.

– రైతులు, దళితులు, గామాలపాడు, దాచేపల్లి మండలం

### కాంట్రాక్ట్ విధానంలోకి మార్చండి



గురుకులాల్లో ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులుగా గత కొంతకాలంగా పనిచేస్తున్న మమ్మల్ని కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్లు(సీఆర్‌టీ)లుగా మార్చి 2022 పీఆర్సీ ప్రకారం జీతాలు చెల్లించాలి. ఆంగ్ల మాధ్యమంలో బోధన చేస్తున్న మాకు ఏడేళ్ల నుంచి జీతాలు పెంచలేదు. దేశంలో ఎక్కడా ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయ వ్యవస్థలేదు.

–గిరిజన సంక్షేమ గురుకులాల ఉపాధ్యాయులు, అధ్యాపకులు

# పండుగలా వై.ఎస్.జగన్ జన్మదినోత్సవం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు
- 21న ఘనంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపు

పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం అంటే పార్టీ నేతలు, కార్యకర్తలు, ప్రజలకు పండుగలాంటిందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు చెప్పారు. ఈనెల 21న వేడుకలకు సంబంధించి నిర్వహించతలపెట్టిన కార్యక్రమాల గురించి సోమవారం బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ కార్యాలయంలో ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. 21న పార్టీ జిల్లా కార్యాలయంలో కేక్ కటింగ్, రక్తదాన శిబిరంతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు తీర్మానించారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా కార్యకర్తలు, యువత పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. గుంటూరు, నరసరావుపేట పార్లమెంట్ జిల్లాల పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ పేదవారి గుండె చప్పుడు అయిన వై.ఎస్.జగన్ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించాలని తెలిపారు. పార్టీ నగర అధ్యక్షులు, డెప్యూటీ మేయర్, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాలవజ్రబాబు (డైమండ్‌బాబు), తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు

## క్లుప్తంగా

### ధనుర్మాస వేడుకలు ప్రారంభం



రేపల్లె రూరల్: సూర్యభగవానుడు ధనురాశిలో ప్రవేశించిన సందర్భంగా నిర్వహించుకునే ధనుర్మాస వేడుకలను సోమవారం పట్టణంలో పలు దేవాలయాలలో ప్రారంభించారు. విష్ణుమూర్తికి ప్రీతిపాత్రమైన ధనుర్మాసం నెల రోజులపాటు పూజలు నిర్వహిస్తూ భగవంతుని కృపకు పాత్రులు కావాలని ఆలయాల అర్చకులు ధనుర్మాస విశిష్టతను భక్తులకు వివరించారు. పట్టణంలోని ఉప్పూడి రోడ్డులో వేంచేసియున్న లక్ష్మీ గోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉదయం నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారికి అభిషేక మహోత్సవం అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామి వారిని, అమ్మవార్లను దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించి, మొక్కుబడులు తీర్చుకున్నారు. రైలుపేట, రామకోటిపేటలలోని రామాలయాలలో, ఓల్డ్‌టౌన్‌లోని వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

### పాఠశాలలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్

- కంప్యూటర్లు దగ్ధం
- రూ.లక్ష వరకు నష్టం



బల్లికురవ: మండలంలోని వల్లాపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కంప్యూటర్లు దగ్ధమయ్యాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయుడి గదిలో నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. పాఠశాల గ్రాంటుతో కొనుగోలు చేసిన కంప్యూటర్లు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. ఉపాధ్యాయులు మంటలు పక్కగదులకు వ్యాపించకుండా అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.లక్ష పైగా ఆస్తి నష్టం సంభవించిందని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు తెలిపారు.

### ఆలయ దుకాణాల వేలంలో రూ.12.84 లక్షలు



వేటపాలెం: రావూరిపేట శివారులో వేంచేసియున్న కనక నాగవరపమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వివిధ దుకాణాల నిర్వహణ హక్కుల కోసం నిర్వహించిన వేలంలో రూ.12.84 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో పోతిన శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. గతేడాది రూ.7.52 లక్షలు ఆదాయం రాగా ఈ ఏడాది నిర్వహించిన వేలంలో రూ.5.32 లక్షలు ఆదాయం అదనంగా చేకూరిందని తెలిపారు. కొబ్బరికాయలు, పూల అమ్మకానికి రూ. 1.89 లక్షలు, శీతల పానీయాలు, ఐస్‌క్రీమ్ విక్రయాల కోసం రూ.2.23 లక్షలు, షామియానా షాపు కోసం రూ.5.10 లక్షలు, చీరలు పోగుచేసుకొనుటకు, కోసం రూ.1.50 లక్షలు, తలనీలాలు పోగు చేసుకోవడం కోసం రూ.65 వేలు, కిళ్లీలు అమ్మకం కోసం రూ.8 వేలు, పాటీళ్ల కోసం రూ. 1.69 లక్షలు కాంట్రాక్టర్లు వేలం ద్వారా సంవత్సరంపాటు విక్రయాల కోసం దక్కించుకున్నారని ఈవో తెలిపారు.

# ఉద్యోగాలిప్పిస్తా'మనీ' టోకరా

- ఎస్పీకి పలువురి ఫిర్యాదు
- పోలీస్ గ్రీవెన్స్‌కు 75 అర్జీలు

నరసరావుపేట: ప్రభుత్వ ఉద్యోగాలిప్పిస్తామని చెప్పి తమను కొందరు మోసం చేశారని పలువురు ఎస్పీ కంచి శ్రీనివాసరావుకు విన్నవించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు జిల్లా నలుమూలల నుంచి బాధితులు తరలి వచ్చారు. 75 ఫిర్యాదులు అందించారు. వీటిని పరిశీలించిన ఎస్పీ సంబంధిత పోలీస్‌స్టేషన్లకు పంపారు.



జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని కలిసి సమస్య విన్నవిస్తున్న బాధితులు

### ఇంటి కోసం కొడుకులే చంపుతామంటున్నారు

నాకు ముగ్గురు కొడుకులు. ముగ్గురికీ పెళ్లిళ్లు చేశా. భర్త చనిపోయాడు. రెండిళ్లు ఉంటే ఒక ఇల్లు అమ్మి కొడుకులకు తలా రూ.2లక్షలు చొప్పున ఇచ్చాను. రెండో ఇల్లు నాపేరుపైనే ఉంచుకున్నా. నేను రెండో కొడుకు వద్దే ఉంటున్నా. రెండో కొడుకుతోపాటు, చిన్నకొడుకు ఉన్న ఇంటిని తమ పేరున రాయాలని వేధిస్తున్నారు. మద్యం తాగొచ్చి కొడుతున్నారు. చంపుతామని బెదిరిస్తున్నారు. వారి నుంచి రక్షణ కల్పించండి. నా రెండు కాళ్లకు బోధకాలు వ్యాపించి నడవలేని పరిస్థితిలో ఉన్నా. దయ ఉంచి చర్యలు తీసుకోండి.

–సయ్యద్ కరీమూన్, తుమ్మలచెరువు, పిడుగురాళ్ల మండలం



ఆటో నుంచి మహిళా పోలీసు సాయంతో దిగుతున్న కరీమూన్

### పత్తికి డబ్బులు ఇవ్వకుండా కొట్టారు

నేను ఈ ఏడాది లక్ష్మీశెట్టి రవికుమార్, తన్నీరు మార్కండేయులలకు 300 క్వింటాళ్ల పత్తి, 360 క్వింటాళ్ల మిర్చి రూ.70 లక్షలకు అమ్మాను. వారు రూ.9లక్షలు అడ్వాన్స్‌గా చెల్లించారు. మిగతా రూ.61 లక్షలు రావాల్సి ఉంది. డబ్బులు అడిగేందుకు వెళితే నన్ను కొట్టారు. వారిపై చర్య తీసుకుని నా డబ్బులు ఇప్పించండి.

– నర్రా రమేష్, విప్పర్ల, క్రోసూరు మండలం

### రూ.3లక్షలు తీసుకుని మోసం

రైల్వేలో ఉద్యోగం ఇప్పిస్తానంటే దూరపు బంధువు అయిన మేడ గోపాలరావుకు ఏడాదిక్రితం రూ.3 లక్షలు చెల్లించా. ఉద్యోగం ఇప్పించకుండా, డబ్బులు తిరిగి ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నాడు. అతడిపై చర్యలు తీసుకుని నాకు న్యాయం చేయండి.

– కుంభ సత్యనారాయణ, ఉప్పలపాడు, నరసరావుపేట మండలం

### రూ.36.40 లక్షలు తీసుకున్నాడు

మా పిల్లలకు గ్రామ సచివాలయం పోస్టు, హైకోర్టు, జిల్లా కోర్టులలో సబార్డినేట్ పోస్టులు ఇప్పిస్తానని సిరికొండ వెంకట్రావు అనే వ్యక్తి రూ.36.40లక్షలు తీసుకున్నాడు. ఉద్యోగాలు ఇప్పించకుండా, తిరిగి డబ్బులు ఇవ్వకుండా మోసం చేశాడు. అతనిపై కేసు నమోదుచేసి మా డబ్బులు ఇప్పించండి.

– బండి రామబ్రహ్మం, గుంటకల శ్రీనివాసరావు, కొమ్ము అన్నపూర్ణరావు, పెద్దచెరువు, నరసరావుపేట

### రూ.2.14లక్షలు కాజేసిన మహిళ

నాకు ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి పొన్నగంటి రమ్యశ్రీ అనే మహిళ రూ.2.14 లక్షలు తీసుకుంది. ఉద్యోగం ఇప్పించకుండా, డబ్బులు తిరిగి ఇవ్వకుండా మోసం చేస్తుంది.

– బంకా సంధ్యారాణి, మునుగోడు, అమరావతి

## శ్రీరామాంజనేయపురంలో పాఠశాల ప్రారంభించండి




గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన పాఠశాల భవనం

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో భవనం నిర్మాణం
- ఉపాధ్యాయ నియామకాలకు ప్రస్తుత సర్కారు మీనమేషాలు
- విద్యార్థులు బడికి ఐదు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోంది
- డీఈఓకు వినతి పత్రం అందించిన ఏపీటీఎఫ్ నేతలు



డిఈఓ చంద్రకళకు వినతిపత్రం అందిస్తున్న ఏపీటీఎఫ్ నేతలు

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా బెల్లంకొండ మండలం శ్రీరామాంజనేయపురం గ్రామంలో ప్రాథమిక పాఠశాలను ప్రారంభించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శి మక్కెన శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. దాదాపు 40 ఏళ్ల క్రితం 1985లోనే రామాంజనేయపురం గ్రామం ఏర్పడినా ఇప్పటివరకు పాఠశాలను ఏర్పాటు చేయకపోవటం శోచనీయమన్నారు. ఇదే అంశాన్ని తమ యూనియన్ పల్నాడు జిల్లా శాఖ ప్రతినిధులు తమ దృష్టికి తీసుకురావటంతో బెల్లంకొండ ఏపీటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు ఉదయ్‌కిరణ్, దుర్గారావు తదితరులతో కలసి స్వయంగా గ్రామంలో పర్యటించి అక్కడి స్థితిగతులను తెలుసుకొన్నట్టు వివరించారు. గ్రామంలో 200 వరకు గృహాలు ఉన్నాయని, దాదాపు వందమందికి పైగా బడిఈడు పిల్లలు ఉన్నట్టు గుర్తించామని పేర్కొన్నారు. గ్రామంలోని పిల్లలు చదువుకోవాలంటే ఐదు కిలోమీటర్లు దూరంలో ఉన్న మన్నెసుల్తాన్‌పాలెం గ్రామానికి వెళ్లాల్సి వస్తోందని ఆవేదన చెందారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఇక్కడ పాఠశాలకు పక్కా భవన నిర్మించినా డైస్ కోడ్ కేటాయించకపోవటంతో ఉపాధ్యాయుల నియామకం చేపట్టలేదని వివరించారు. విద్యాశాఖాధికారులు వెంటనే స్పందించి శ్రీరామాంజనేయపురంలోని పాఠశాలకు ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. ఈమేరకు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ ఉస్మాన్, కరిముల్లా, ఆడిట్ కమిటీ కన్వీనర్ బొర్రా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### పిట్టంబండ మేజరు కాల్వలో యువకుడి మృతదేహం



శావల్యాపురం: మండలంలోని మతుకుమల్లి గ్రామ సమీపంలో పిట్టంబండ ఎన్ఎస్పీ కాలులో యువకుడి మృతదేహం గుర్తించినట్లు ఎస్ఐ లేళ్ళ లోకేశ్వరరావు సోమవారం తెలిపారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వినుకొండ పట్టణం శివారు నాగిరెడ్డిపల్లికి చెందిన దాసరి వంశీ (21) ఐటీఐ చదువుకొని ప్రస్తుతం వినుకొండ హెచ్‌పీ గ్యాస్‌లో డెలీవరి బాయ్‌గా పనిచేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గ్రామస్తుల సమాచారం, వీఆర్వో ఫిర్యాదు మేరకు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించామని పేర్కొన్నారు.

### యార్డుకు 57,488 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 57,488 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 51,264 అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.7,500 నుంచి రూ. 15,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.8,000 నుంచి 16,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం రూ. 8,000 నుంచి రూ. 15,500 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 7,500 నుంచి రూ. 16,000 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 42,799 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు ఉన్నతశ్రేణి కార్యదర్శి వి.అంజనేయులు తెలిపారు.

## ఉత్సాహంగా ఎడ్ల బల ప్రదర్శన పోటీలు ప్రారంభం



ఎడ్ల బల ప్రదర్శన పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

గురజాల: పట్టణంలోని పాతపాటేశ్వరి అమ్మ తిరునాళ్ల సందర్భంగా రైతు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎడ్ల బల ప్రదర్శన పోటీలు సోమవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ప్రారంభించారు. తొలి రోజు సీనియర్ విభాగంలో జరిగిన పోటీల్లో నంద్యాల జిల్లా పెదకోట్యాలకు చెందిన బోరెడ్డి కేశవరెడ్డి, తెలంగాణ రాష్ట్రం హుజుర్‌నగర్‌కు చెందిన సుంకి సురేంద్రరెడ్డి, సాకేత్ రెడ్డి, సారికారెడ్డి ఎడ్ల జత 3,439.6 అడుగుల దూరం లాగి ప్రథమ బహుమతిని, కృష్ణా జిల్లా పెనుమలూరుకు చెందిన గరికిపాటి శ్రీధర్ ఎడ్ల జత 3,200 అడుగుల దూరం లాగి ద్వితీయ బహుమతిని, నాగర్ కర్నూల్ తాడూరు, యాదిరెడ్డి పల్లెకు చెందిన డాక్టర్ అకిలేష్‌రెడ్డి ఎడ్ల జత 3,090.3 అడుగుల దూరం లాగి మూడో బహుమతిని, దాచేపల్లి మండలం కేసానుపల్లి గ్రామానికి చెందిన నెల్లూరి రామకోటయ్య ఎడ్ల జత 3,045.2 అడుగుల దూరం లాగి నాలుగో బహుమతిని పొందాయి. గుంటూరు జిల్లా తాడేపల్లి కుంచనపల్లికి చెందిన పులగం జశ్వంత్‌రెడ్డి ఎడ్ల జత 2,800 అడుగుల దూరం లాగి ఐదో బహుమతిని, సిరిమెళ్ల సంపుమాందిన్నెకు చెందిన కుందూరు రాంభూపాల్‌రెడ్డి ఎడ్ల జత 2,628 అడుగులు దూరం లాగి ఆరో బహుమతిని, గురజాల మండలం పులిపాడుకు చెందిన పెద్దినేని అమరనాగేశ్వరరావు ఎడ్ల జత 2,600 అడుగుల దూరం లాగి ఏడో బహుమతిని సాధించాయి. కృష్ణా జిల్లా ఘంటసాలకు చెందిన మేకా కృష్ణమోహన్ ఎడ్ల జత 2,246.2 అడుగుల దూరం లాగి 8వ బహుమతిని, నల్గొండ జిల్లా కోప్పోలుకు చెందిన ఐతరాజు సత్యనారాయణ ఎడ్ల జత 1,826 అడుగుల దూరం లాగి 9వ బహుమతిని పొందినట్టు కమిటీ నిర్వాహకులు తెలిపారు.

## వర్సిటీ అథ్లెటిక్స్ ఓవరాల్ రన్నర్స్ కృష్ణవేణి కళాశాల



వర్సిటీ ఓవరాల్ రన్నర్స్ సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ నాతాని, పీడీ ఆదిబాబు

నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ పోటీలలో కృష్ణవేణి డిగ్రీ కళాశాల ఓవరాల్ రన్నర్స్‌గా నిలిచినట్టు కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు, వ్యాయామ అధ్యాపకుడు ఈదర ఆదిబాబు సోమవారం తెలిపారు. వర్సిటీలోని సింథటిక్ ట్రాక్‌పై ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించిన పురుషులు, మహిళల అథ్లెటిక్స్ పోటీలలో తమ విద్యార్థులు నాలుగు బంగారు, ఐదు సిల్వర్, 14 కాంస్య పతకాలతో ఆల్‌రౌండ్ రన్నర్స్‌గా నిలిచారని వివరించారు. తమ విద్యార్థులు కె.విశాలాక్షి ఆఫ్ మారథాన్‌లో బంగారు, మిక్స్‌డ్ రిలేలో వెండి, 10 కిమీ రిలేలో వెండి పతకాలు, ఎం.శిరీషా హెప్టాథిలిన్‌లో బంగారు, 800మీ పరుగులో బంగారు, 4x100 రిలేలో కాంస్యం, ఎం.చాడేశ్వరీ 400 మీటర్లు హర్డిల్స్‌లో బంగారు, 4x100 రిలేలో కాంస్యం పతకాలు సాధించారని తెలిపారు. వీరితో పాటు ఎం.హేమలత, టి.కస్తూరి, ఎం.లక్ష్మీపావని, వినోదిని, ఎ.అశ్విని, బి.అలేఖ్య, పి.హేమలత, కె.అనూష, సి.హెచ్.దుర్గాభవాని, భవ్యజ్యోతి, గోపీనాథ్, యెహూవా శివ వివిధ అంశాలలో పతకాలు సాధించారని వివరించారు. విద్యార్థులకు కళాశాల అధ్యాపకులు అభినందించారు.

## ట్రాన్స్‌ఫార్మర్ల దొంగలు అరెస్ట్

రూ.3.50 లక్షల విలువైన రాగి తీగను స్వాధీనం చేసుకున్న పోలీసులు



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కె.నాగేశ్వరరావు

వినుకొండ(నూజెండ్ల): పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లను దొంగతనం చేస్తున్న దొంగలను అరెస్ట్ చేసినట్లు నరసరావుపేట డీఎస్పీ కె.నాగేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని ఐనవోలు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు సిబ్బంది సాయంతో దొంగలను పట్టుకున్నామన్నారు. ప్రకాశం జిల్లా దోర్నాల మండలం అనసపాలెంకు చెందిన నల్లబోతుల పెద్ద యంగయ్య, పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం పెద్దవరం గ్రామానికి చెందిన బత్తుల కోటయ్య, తురిమెల్ల గ్రామానికి చెందిన తోలుసురి లక్ష్మీనారాయణ, వినుకొండ మండలం గాంధీనగర్‌కు చెందిన వీరబోయిన బాలయ్య ఏడాదిగా పల్నాడు జిల్లా, ప్రకాశం జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్‌వైర్ దొంగతనాలకు పాల్పడుతూ తక్కువ రేటుకు ఇనుప కొట్లల్లో అమ్ముకుంటున్నారు. వీరు ఐనవోలు పోలీస్ స్టేషన్ పరిధిలోనే కాకుండా పల్నాడు జిల్లాలోని శావల్యాపురం, బండ్లమోటు, వినుకొండ, నకరికల్లు, మాచర్ల టౌన్, రొంపిచర్ల, ప్రకాశం జిల్లాల్లోని దొనకొండ, త్రిపురాంతకం, యర్రగొండపాలెం, పెద్దారవీడు, దర్శి పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో దొంగతనాలకు పాల్పడినట్లు మొత్తం 27 కేసులు ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. వీరిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి సుమారు రూ.3.50 లక్షల విలువైన 350 కేజీల కాపర్‌వైర్‌ను స్వాధీనపరచుకున్నట్లు వెల్లడించారు. విలేకరుల సమావేశంలో వినుకొండ రూరల్ సీఐ బి.ప్రభాకర్, ఐనవోలు ఎస్ఐ బీవీ కృష్ణారావు, సిబ్బంది పాల్గొన్నారు.

## అన్నను, తమ్ముడిని హత్యచేసిన సోదరి!

- తండ్రికి ప్రభుత్వం నుంచి రావాల్సిన డబ్బు కోసమే ఘాతుకం!
- అన్న పోలీస్ కానిస్టేబుల్, తమ్ముడు ప్రైవేట్ టీచర్
- భర్తను ఒదిలేసి పుట్టింట్లోనే ఉంటున్న నిందితురాలు
- దర్యాప్తు చేస్తున్న పోలీసులు



గోపి కృష్ణ



దుర్గా గణేష్



నిందితురాలు కృష్ణవేణి

నకరికల్లు: తండ్రికి ప్రభుత్వం ఇచ్చే ప్రోత్సాహకాల కోసం సొంత అన్నను, తమ్ముడిని సోదరి హతమార్చింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నకరికల్లుకు చెందిన పొలురాజు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ పక్షవాతంతో మృతి చెందాడు. అతనికి ముగ్గురు సంతానం. వారిలో పెద్ద కుమారుడు గోపీకృష్ణ బండ్లమోటు పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్. రెండో సంతానం కృష్ణవేణి. ఈమెకు ఒక కుమార్తె. భర్తను వదిలేసి పుట్టింట్లోనే ఉంటుంది. మూడో కుమారుడు దుర్గా రామకృష్ణ ప్రైవేటు టీచర్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం. గోపీకృష్ణ, రామకృష్ణలను భార్యలు విడిచిపెట్టి పుట్టింటికి వెళ్లారు. పొలురాజు భార్య గతంలోనే మృతి చెందింది. పొలురాజుకు రెండు ఇళ్లు ఉండగా ఇద్దరు కుమారులు పంచుకున్నట్లు సమాచారం. ఇక పొలురాజు మృతి చెందాక ప్రభుత్వం నుంచి వచ్చే డబ్బు విషయమై పిల్లలు ముగ్గురి మధ్య కొన్నాళ్లుగా వివాదం రేగింది. తండ్రి అనారోగ్యంగా ఉన్న సమయంలో బాగోగులు చూసుకున్నానని తనకే ఆ డబ్బు చెందాలని కృష్ణవేణి, కాదని సోదరులు గొడవలు పడ్డారు. కృష్ణవేణికి నకరికల్లులో ప్రియుడు కూడా ఉన్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే నవంబర్ 26 నుంచి తమ్ముడు దుర్గారామకృష్ణ, ఈనెల 10 నుంచి అన్న గోపీకృష్ణ కనిపించడం లేదు. గోపీకృష్ణ విధులకు హాజరుకాకపోవడంతో అతనికి జారీ చేసిన పోలీసులు ఆరా తీయగా అసలు విషయం వెలుగు చూసింది. ప్రాథమిక విచారణలో మద్యం అలవాటున్న గోపీకృష్ణ, రామకృష్ణకు పూటుగా మద్యం తాగించి తన చున్నీతో హత్యచేసి ఆ తర్వాత కాలువలో పడేశానని నిందితురాలు పోలీసుల వద్ద ఒప్పుకున్నట్లుగా సమాచారం. హత్యలకు స్థానికంగా ఉండే నలుగురు మైనర్లు నిందితురాలికి సహకరించినట్టు తెలుస్తోంది. ఘటనపై ఎవరూ ఫిర్యాదు చేయకపోవడంతో ఎలాంటి కేసూ నమోదు కాలేదు.

**కాలువల్లో లభ్యమైన మృతదేహాలు**

రెండురోజుల క్రితం ముప్పాళ్ల సమీపంలో గుంటూరు మేజర్ కెనాల్‌లో ఒక మృతదేహం, సోమవారం చల్లగుండ్ల సమీపంలోని గోరంట్ల మేజర్‌లో మరొక మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. కనీసం గుర్తుపట్టలేని స్థితిలో మృతదేహాలు ఉన్నాయి. దీనిపై ఎస్పీ కె.శ్రీనివాసరావు, డీఎస్పీ ఎం.హనుమంతరావు, సీఐ ఎం.వి.సుబ్బారావు విచారణ చేపట్టారు. ఎస్ఐ చల్లా సురేష్ వద్ద ఘటనకు సంబంధించిన వివరాలు సేకరించారు. మృతుల ఇంటి వద్దకు వెళ్లి ఘటనాస్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఇదిలా ఉంటే సమాచారం అందుకున్న గోపీకృష్ణ భార్య హిమబిందు సోమవారం నకరికల్లుకు చేరుకుంది. ముప్పాళ్ల వద్ద లభించిన మృతదేహం తన భర్తదిగా మృతదేహంపై ఉన్న చొక్కా ఆధారంగా గుర్తుపట్టినా మెడికల్ సంబంధిత ఆధారాల కోసం పోలీసులు యత్నిస్తున్నారు. దర్యాప్తు ముమ్మరం చేశారు.

## రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల విజేత గుంటూరు



రాష్ట్రస్థాయి విజేతగా నిలిచి బహుమతి అందుకుంటున్న గుంటూరు జిల్లా బాలుర జట్టు

- బాలురు, బాలికల విభాగంలో సత్తా చాటిన క్రీడాకారులు
- రన్నర్లుగా నిలిచిన పశ్చిమగోదావరి, శ్రీకాకుళం
- బాల, బాలికల విభాగంలో తృతీయ స్థానంతో సరిపెట్టుకున్న విజయనగరం



బహుమతి అందుకుంటున్న గుంటూరు జిల్లా బాలికల జట్టు

సత్తెనపల్లి: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-19 బాల, బాలికల బేస్‌బాల్ క్రీడా పోటీల్లో గుంటూరు బాలురు, బాలికల జట్లు సత్తా చాటి విజేతలుగా నిలిచాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి అండర్ -19 బేస్ బాల్ పోటీలు సత్తెనపల్లి మండలం దూళిపాళ్లలోని లయోలా ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో నిర్వహించారు. సోమవారం ఫైనల్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. అండర్ -19 బాలుర విభాగంలో ఫైనల్స్‌లో పశ్చిమ గోదావరి జిల్లా జట్టుపై గుంటూరు జిల్లా జట్టు క్రీడాకారులు పైచేయి సాధించి విజేతగా నిలిచింది. విజయనగరం జట్టు తృతీయస్థానంతో సరిపెట్టుకుంది. బాలికల విభాగంలోనూ శ్రీకాకుళం జిల్లా జట్టుపై గుంటూరు బాలికల జట్టు విజేతగా నిలిచింది. విజయనగరం జిల్లా జట్టు తృతీయ స్థానంతో సరిపెట్టుకుంది.

**క్రీడాభివృద్ధికి ప్రభుత్వం కృషి**

క్రీడాభివృద్ధికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ చెప్పారు. బేస్‌బాల్ పోటీల విజేతలకు సోమవారం ఆయన బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడాకారులకు ఉద్యోగాల్లో రిజర్వేషన్‌ను రెండు శాతం నుంచి మూడు శాతానికి పెంచడం క్రీడాభివృద్ధికి దోహదం చేస్తోందన్నారు. క్రీడాకారులకు రాత పరీక్షల్లోనూ రిజర్వేషన్ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో లయోలా ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ ఇ.వంశీకృష్ణారెడ్డి, అండర్-19 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి జి.నరసింహారావు, సహాయ కార్యదర్శి సిహెచ్ పద్మాకర్, దాసరి కోటేశ్వరరావు, కడియం జయరావు, సి.నాగేంద్ర పాల్గొన్నారు.

### జాతీయ బీచ్ వాలీబాల్ పోటీలకు సువర్ణ ఎంపిక

నూతక్కి(మంగళగిరి): భువనేశ్వర్‌లో ఈ నెల 18నుంచి 20 వరకు జరగనున్న జాతీయ బీచ్ వాలీబాల్ పోటీలకు నగర పరిధిలోని నూతక్కి జిల్లా పరిషత్ స్కూలు విద్యార్థిని నూతక్కి సువర్ణ ఎంపికైంది. గత నెల 27,28వ తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో గుంటూరు జిల్లా కెప్టెన్‌గా అత్యుత్తమ ప్రతిభ కనబరచినట్లు సోమవారం పీడీ కె. రజనీనాయక్ తెలిపారు. రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం సాధించి జాతీయ పోటీలకు ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు.